
# అడ్జస్ట్‌మెంట్

ఆర్.వి.రాజశేఖర్



చీకటి ....................
ఎటు చూసినా చీకటి
.........................
మనసునిండా మెదడు నిండా
...............
జీవితం అంతా ప్రపంచం అంతా..............
నడుస్తున్నాను దేనికోసమో చీకటిని చీల్చుకుంటూ
ఎంత వెళ్ళినా ఏమి చేసినా అంతా చీకటి
ఏం వెతుకు తున్నాను నేను, మానవత్వం కోసమా?





కాదు మంచితనం కోసమా? కాదు సమానత్వం కోసమా?
కాదు పోనీ డబ్బు, సుఖం, కీర్తి వీటికోసమా?

కాదు కాదు అవన్నీ నాకు కోకొల్లలుగా ఉన్నాయి సముద్రం లోనీళ్ళలా మరి దేని కోసం "నిజంకోసం" అవును నిజంకోసం నిజంగా నిజంకోసం నాకు నిజంకావాలి నిజమైన నిజంకావాలి ఈ నీడ తెరలు తొలగాలి ఎలా? ఆ ప్రయత్నం లోనేనేమైనా అయిపోతే ఎందుకు ఎందుకు నాలో ఈ ఆవేదన దేనికోసం ఈ తపన నాకెవ్వరూ సాయం రారా? నేను ఒంటరిని కాదే నాలో ఏమిటీ అంతరంగమథనం? ఎందుకు? నాకు అందరూ ఉన్నారు. నేను అనాథనుకాను. నా భార్య అవును.నా భావాలకు ప్రతిరూపం నా ఆవేదనకు పరిష్కారం. నా సుఖంలో కష్టంలో నాకు తోడు. అందుకే ఈ అగమ్య గోచరమైన నిశీధిలో ఆమెతోడు అవసరం ఆమె సహచర్యంతో ఆమె స్పర్శతో నాలోని ఆవేదనని రూపు మాపుతాను. తల్లిఒడిలో బిడ్డవలె ఆమెలో నేను ఐక్యమౌతాను. సేద తీరుతాను. సేద తీరుతాను. అదిగో నా భార్య చీకటిలో నా కోసమే కాబోలు వెదుకుతోంది. అవును నా జీవితంలో నేను సాధించుకొన్న నా స్వార్జకఫలం. నా పాలపొంగులాంటి ఆవేశాన్ని ఆర్పివేయగల మధుర శక్తి ఆమె బంగారు చేతులకేఉంది.

"రేఖా..... రేఖా......" గట్టిగా పిలిచాను పలకలేదు.

"రేఖా నేనిక్కడ ఉన్నాను ఇలారా నా దగ్గరగారా" నా దేవత నాదగ్గర ఉంది ఇప్పుడు లోకం ఏమైపోయినా పర్వాలేదు. లోకమంతా విషం నిండినా ఏమీకాదు. ఆమె తోడు లేనిదే నేనేమీ సాధించలేను అందుకే ఆమె హృదయంలో నేనిమిడిపోయేలా దగ్గరౌతాను. గాలిదూరనంత గట్టిగా నేనామెదగ్గరకు చేరుతాను. తనువులు వేరైనా మనసులు ఏకమయ్యేంత గట్టిగా.... మరి ఏ శక్తి విడదీయులేనంత గాఢంగా...... "రేఖా...." పిలిచాను గోముగా, ఆర్తిగా, తృప్తిగా.

"ఛీ వదలండి..... చీకట్లో కూడా సరసమేనా ఏళ్ళు వస్తున్నాయి ఎందుకు......"? రేఖ కోపంలో ఉన్నట్లుంది. "రేఖా నువ్వు లేకపోతే పోయేదేమిటో తెలుసుకున్నాను. అందుకే నువ్వు లేనిదే నేనుండలేను....." "అయినా రేఖా నేను నిన్ను దగ్గరకి తీసుకొంది వాంఛతో కాదు." సర్దిచెబుతున్నాను.

"నాకు తెల్సురా వెధవ నీకు వాంఛ లేదు, పల్లకాడు లేదు. నాకూ తెలుసా విషయం ఉంటే ఈ పాటికి పిల్లలు పుట్టరు" నిర్మొహమాటంగా అంటుంది రేఖ; నా రేఖ "రేఖా నువ్వేగా సంసారంలో తృప్తిగా ఉన్నాను పిల్లలు పుట్టడానికి, లేకపోవడానికి మీరే కాదు నేనూ కారణం అయ్యుండచ్చుగా అన్నావు మరి ఇప్పుడు......" నా గొంతు నాకేవింతగా ఉంది. అయినా ఈ పరిస్థితి వస్తుందని నేనేరోజూ ఊహించ లేదు. అందుకే నా గొంతు దుఃఖంతో

**రీతిక శీర్షిక యువతకై ప్రత్యేకించిన శీర్షిక. యువకవులు, కథకులు అనేకమంది తమ కథలను, కవితలను 'ఆహ్వానం' పత్రికకు పంపుతున్నారు. వీరిని ప్రోత్సాహించేందుకై రీతిక శీర్షికలో క్రొత్త కవులకు, కథకులకు కొన్ని పేజీలు కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన యువతరం తమ కథలను, కవితలను సామాజిక అవగాహన కొరవడకుండా సంక్షిప్తంగా రాసి పంపితే ప్రచురిస్తాం. —ఎడిటర్**

పూడుకు పోతుంది. "అవును అన్నాను; అనక, ఇక్కడ కనీసం కూడు గుడ్డ అన్నా ఉంది; సంసారం నీ వల్లకాదురా పో... వెధవా అని వెళ్లిపోతే పుట్టింట్లో అదికూడా లేదుగా...." అంటే, అంటే కేవలం తిండికోసం నాతో ఉందా ఇంత పరుషంగా మాట్లాడేది నా రేఖేనా, ఒకప్పటి నా ప్రియురాలు రేఖేనా? కాదు నేను చీకట్లో మోసపోయుంటాను. "మరి నన్ను ప్రేమించావన్నావు ఇపుడు వెధవ ముఖం అయిపోయిందా" పట్టుదలగా అడిగాను.

"అవునురా ప్రేమించాను పెళ్ళి చేసుకోడానికి ఇంకోమార్గం లేక నీ దిక్కుమాలిన ముఖాన్ని ముక్కు మూసుకొని ప్రేమించాను. పెళ్ళి అనేదే లేకపోతే నీకు ఆడదాని స్పర్శ అన్నా ఉండేదా? ఇరవై ఏళ్ళు రాగానే, పుట్టింటి వాళ్ళకి భారం కాకూడదని కేవలం నీ డబ్బు చూసి ఛ అసలు నీది మనిషి జన్మా? ఆ బానకడుపూ, నల్లరంగు......"

రేఖ అలా మాట్లాడుతూనే ఉంది నేనింకా, వినలేక పోయాను స్టాపిట్; స్టాపిట్ ప్లీజ్, ప్లీజ్ గట్టిగా అరిచాను కానీ ఆ కేకలో ఏదోస్వరం శృతికల్పింది అపశృతిగా అది నా మనసు మూగరోదన అయివుంటుంది. మళ్ళీ చీకటి నా నమ్మకపు సౌధం నిండా నా ప్రేమ సామ్రాజ్యం నిండా అంతా చీకటి. పేరుకు పోతున్న చీకటి, మనుష్యుల పాపంలా రక్తపిశాచంలా నా బ్రతుకంతా శూన్యమేనా, కాదు కాకూడదు నాకేంటి మగాడ్ని తనే నన్ను ప్రేమించినట్లు నటించింది. తనే నాశనం అవుతుంది అంతే. మగాడు పెళ్ళిచేసుకోవడానికి అర్హత అందం కాదు ఆదాయం అవును ఆదాయం; అది నాకుంది నేను కష్టించి దాచుకొన్నది నాస్వంతం నా వృత్తిలో నన్ను మెచ్చేలోకం ఎంతో ఉంది. అవును ఎంతో.....

"ఏరా రమేశ్ బావున్నావా" ఎవరది నన్నురా అనిపిలుస్తున్నది కాంట్రాక్టర్ పరంధామా ఎంతధైర్యం వాడికి నన్ను అరే అంటాడా అదే అడిగాను "మరి దొరగారు అనాలా. లంచం తినే కుక్క" ఎగతాళిగా అంటున్నాడు. నను ఎద్దేవా చేస్తున్నాడు. నా చేత ఎన్నో పనులు చేయించుకున్నాడు. నిన్న మొన్నటిదాకా ఇంజనీరింగ్ రంగంలో, నీ అంత మేధావి మరొకడు లేడన్నాడు ఇపుడు... అందుకే అటో ఇటో తేల్చుకోవాలి.

"మర్యాద ఇచ్చి పుచ్చుకోడం నేర్చుకోండి" ఖచ్చితంగా అన్నాను.

"మర్యాదా నీకు మర్యాదా లంచం డబ్బుతో ఒళ్ళు కొవ్వెక్కిన వెధవ"

"ఏమిటి మాట్లాడితే లంచం, లంచం అంటున్నావ్. అసలు నువ్వేగా మామూలు తీసుకోక పోతే మడిచి కాదు అని నాకల వాటు చేసింది" రోషంగా అన్నాన్నేను.

"అహ. అయితే లంచం కోసం నా ఫైళ్ళు ఆపుతావా ఎంత ధైర్యం రానీకు లం.... కొ....."

"రేయ్ నీ నాలుక చీరేస్తాను నీ ఫైలు కదలనివ్వను నీ బాబుకు చెప్పుకో పో....." ఆవేశం విపరీతం కాగా కరిచినంత పనిచేశాను.

"పోతారా పోతా ఇలా లంచాలు తింటూనే ఉండు ఏదో ఒక రోజు నీకు మూడుతుంది. నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తారు. నువ్వు రోడ్డున పడతావు. నిన్ను నీ పిల్లల్ని......" "ఆపు ఆపు నేను వినలేను" నాకు తెలియకుండానే నా ఒళ్ళు తడిసిపోయింది నా మనసు పెట్టిన కన్నీరుతో. మళ్ళీ చీకటి, అనంతమైన చీకటి, చిక్కటి చీకటి, జడలూనిన పెనుభూతంలా నన్ను కబళిస్తున్న చీకటి. అర్థంకాని. పరిస్థితులతో అలుముకొంటున్న చీకటి.

దేవుడు లేని గర్భగుడిలా తయారైంది నా అంతరంగం ఏ ఆలోచనా లేక ఆలోచన లేక కాదు ఆలోచించేశక్తి లేక నా కిపుడు ఏం కావాలి కల్తీలేని ఆదరణ, స్వచ్ఛమైన ప్రేమ, నిజమైన నిజం, చెదిరిపోని బంధం అన్నిటికీ అతీతమైన ఆత్మీయత అవును అదేకావాలి. కానీ ఏదీ? ఏది చూసిన కల్తీ ప్రేమ కల్తీ, మమత కల్తీ, భార్య కల్తీ, బంధుత్వం కల్తీ, పేరు పలుకుబడి కల్తీ, ఉద్యోగం కల్తీ, స్నేహం.... అవును స్నేహం కల్తీకాదు. నా ప్రాణమిత్రుడు మురళి, అవును వాడు విశ్వాసఘాతకుడు కాదు. నన్ను అభిమానించేది వాడే వాడిది నిజమైన స్నేహం, నేను వెదుకుతున్న నిజంవాడే; అవును వాడే అడుగో మురళి, "అరే మురళీ చూడరా వీళ్ళంతా నన్ను ఇచ్ఛ వచ్చినట్లు వాడుకొని ఇప్పుడు నువ్వు వెధవవి అంటున్నార్రా నన్ను ఊబిలోకి లాగి వాళ్ళు దులుపుకొని వెళ్ళి పోతున్నార్రా. నన్ను కాపాడరా. ఈ అబద్దపు ప్రేమలనుండి, అబద్దపు సేవలనుండి నీ స్నేహపు పాశంతో కాపాడరా, నన్ను నీ గుండెల్లో ఉంచుకుంటావు కదూ నేనంటే నీకు చచ్చేంత ప్రేమకదూ.......? నాకోసం నువ్వేమైన చేస్తావు కదూ..... చెప్పరా" "మురళీ ప్లీజ్ చెప్పరా?"

"ఏంటిరా చెప్పేది వెధవా, నీ ఖర్మకు నన్నేం చేయమంటావురా?"

అయిపోయింది నా ఆశలసౌధానికి, నమ్మకపు కోటకు బీటలు వారింది. వీళ్ళంతా కసిగా మరఫిరంగులు బెట్టి దాన్ని కూలగొడ్తున్నారు. మంచి వాడిగా కాదు కనీసం వాళ్ళకి నేను మనిషిగా కూడా అక్కరలేదు. నిజమైన దేది నాకు చిక్కనలేదు. అయినా ఎక్కడో ఆశ గోరంత దీపంలా "ఒరేయ్ మురళీ అలామాట్లాడకురా అవినీతి జీవితంతో అసమర్థపు ప్రవర్తనతో అపరాధినైన నేను ఇంకా వేగలేను నన్ను వేధించకురా. అయినా ప్రతి పనీ నిన్నడిగే చేశాను కదరా" ఎలాగైనా ఒప్పించాలనే

చదలవాడ కుటుంబరావు నలుగురి ప్రోత్సాహంతో ఎలాగైతేనేం ఒక చిన్న రేడియో కొన్నాడట. కొన్నవారం రోజుల తరువాత, తిరిగి దాన్ని పట్టుకెళ్ళి షాపువాడి బల్ల మీద పెట్టాడట - దానితో ఆ షాపుయజమాని గతుక్కుమని "అదేమిటి మాష్టారు మంచి గ్యారంటీ కంపెనీది ఇది. సరిగ్గా పనిచేయలేదా?" అన డిగాడు.

"దాంతో కుటుంబరావు ఫక్కున నవ్వి సౌండ్ బాగానే వస్తుందయ్యా! కాని బుల్లోడా- ఏ ఆంధ్రపత్రికైనా చదువుకోవాలంటే దీన్ని తగలెయ్య. లోపల మరీ గుడ్డిదీపం పెట్టాడుగ దయ్యా" అని విసుక్కున్నాడు.

- మేడిశెట్టి



నా తపన. "అవును అడిగావు నేను కాదన్నా నువ్వు ఏ విషయం ఆపుకోవుకదా అందుకే అవునన్నాను నువ్విచ్చిన పార్టీలు అందుకున్నాను. అంతమాత్రాన నువ్వు దేవుడివి అని కొలవాలా గొప్పవాడివి అని దండవేయాలా ? పిచ్చి పిచ్చిగా వాగుకురా ఫూల్. "

"అరే మురళీ నాకున్నంతలో నీకు ఎంతో సహాయం చేశాను కదరా. ఆఖరికి నీ ఉద్యోగవిషయంలో కూడా సహాయం చేశాను కదరా ఆ మాత్రం విశ్వాసం లేదా? గొప్పవాడివి అనక్కర్లేదు. మంచివాడివి అనరాచాలు" నేను మాటలొచ్చిన మూగవాడ్ని అవుతున్నాను బాధతో, ఆవేదనతో వీడైనా అంగీకరిస్తాడని అనుకుంటే, ఇంత చేసినా నన్నింకా అసమర్థుడు అవినీతిపరుడూ అంటున్నదే ఈ లోకం వాడి నోటి మాట కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాను అది నాకు కడుపు నింపకపోవచ్చు కానీ తృప్తి ఆత్మసంతృప్తి అందుకే నా ఆరాటం వాడింకా నోరు తెరవలేదు ఇంకా.... "ఎందుకనాలిరా నీవు నాకు డబ్బు సాయంచేశావంటే ఎందుకు చేశావో, ఏమాశించి చేశావో అయినా నేను చెయ్యమని, నిన్ను ప్రాధేయపడలేదే....."

ఇంకా ఏదో అంటున్నాడు నా మీద నాకే అసహ్యం వేస్తోంది. వాకు ఇక వినే ఓపిక, విని తట్టుకొనే శక్తి ఇకలేవు. నా కెవ్వరూ లేరు. నేను జనారణ్యంలో బ్రతుకుతున్న అనాధని. నేను ఎవ్వరికీ ఏమీకానీ వింత ప్రపంచంలో అనుబంధం లేమితో డబ్బు మాత్రమే ప్రధానంగా చెలామణీ అవుతున్న శవాన్ని. ఎక్కడ లోపం నాదా? వారిదా? నా మనస్సు నాకు బలమివ్వదే? కారణం ఏమిటి? నేను చేస్తున్న తప్పులా, అవినీతా, అసమర్థతా, మెహర్బానీకి లొంగిపోయే మనత్తత్వమా, అయినా నన్నిలా తయారు చేసింది వీళ్ళు కాదా? నేను వాళ్ళ మాటలు వినకపోతే సమాజంలో గౌరవం పొందగలనా. మరి వీళ్ళెందుకిలా ప్రవర్తిస్తున్నారు. అందరూ ఇంతేనా ఎవరి స్వార్థం వారిదేనా? లోకం అంతా శూన్యమేనా? ఏమో తెలియదు. అన్నీ ప్రశ్నలే సమాధానం లేని ప్రశ్నలు, వెలుగు చూడని ప్రశ్నలు, ప్రశ్నించడానికే కష్టమైన ప్రశ్నలు, ఈ చీకటి పోవాలి, నాకు వెలుగు కావాలి, ఆత్మసంతృప్తి కావాలి. అందుకే నేను మారతాను పూర్తిగా మారిపోతాను. అప్పుడు ఎవరేమై పోయినా పర్లేదు. నాకు వెలుగు కావాలి. నేను నిజాయితీగా ఉంటే నన్ను కొందరైనా అభిమానిస్తారా? నా జీవితంలో వెలుగు నిడుతుందా వెలుగు కానవస్తుందా? అవును వెలుగువస్తోంది ఓ భగవాన్ నన్ను రక్షించు నన్ను రక్షించు. వెలుగు వెలుగు వెలుగొచ్చేసింది. ఎదురుగా లక్ష్మీదేవీ అవును నిజంగా లక్ష్మీదేవి ప్రక్కనే పురుగుల వెదుకులాటలో బల్లి. వచ్చింది వెలుగోకాదోగాని పోయింది కల. అమ్మో కలా ఎంత భయంకరమైన కల నిజంగా ఈ మనుష్యుల రూపం అలానే ఉంటుందా? బహుశా అదివారి ఆలోచనల రూపమేమో. ఏమో ఏదీ స్పష్టంగా తెలియదు. మేల్కొన్నా నాలో కల తాలూకూ ఆలోచనలు వరదల్లా. జీవితం అంతా నటనేనా? అయినా బ్రతకాల్సిందేగా! నా భార్య రేఖ వస్తున్నట్లుగా గజ్జెల సవ్వడి "శుభోదయం దొరగారు" పలకరింపు ఆహా, ఆ నవ్వులో ఎంత అందం. అది స్వచ్ఛమైన నవ్వేనా? ఎలా కనుక్కోవడం దానికీ దీనికీ ఎంత తేడా? ఏది నిజం ఏది కల?

"అబ్బా కాఫీ తీసుకోండి అవతల నాకు పనుంది" ఆమె ముఖంలో స్పష్టమైన విసుగురేఖ తళుక్కుమని మెరిసి పోయింది. మళ్ళీ చిరునవ్వు

"ఏమండి......."

తపీమని తీసుకున్నాను. అంతకంటే నేను ముందుకు ఊహించలేను. కలలోనే భరించలేకపోయానే ఇక నిజంగానా అమ్మో, ఆ కలకి నా జీవితానికి సంబంధం ఉందా, లేదా? లేక నేను కారణం లేకుండా ఊహిస్తున్నానా? ఏమో. ఉన్నాలేకపోయినా ఆమె నా భార్య. ఆమె ఇంట్లోంచి వెళ్ళిపోతే పరువు తక్కువ అందుకే "లేదు ఆమెకి ఆ ఆలోచనే లేదు ఉండకూడదు" తప్పదు అజస్ట్‌మెంట్ బ్లడీ అడ్జస్ట్‌మెంట్.

ఇంతలో మా ఆవిడ కేక సైరన్‌లా "ఏమండీ మీ కోసం కాంట్రాక్టర్ అప్పయ్య వచ్చాడు."

కాంట్రాక్టర్ కలలో రెండో క్యారెక్టర్ అనుకొంటూ వెళ్ళాను "నమస్తే సార్"

ఆపలకరింపులో ఎంతతేడా! ఖచ్చితంగా ఇదే నిజం, లేకుంటే అక్కడలా ఇక్కడ కూడా క్రూరంగా ఉండాలిగా "ఈ బిల్‌లో కూడా మామూలుగా 30% తీసుకోండి సార్. కొంచెం తొందరగా అయ్యేట్లు చూడండి......" ఇంకా చెబుతూనే ఉన్నాడు. ఇదే నిజం, నిజమే మరి అదేమిటి దాని పేరేమిటి, నీడా అవును నీడే నా మనసుకు నీడ వారందరి మనస్సులకు నీడ ఈ ప్రపంచపు నీడ. కానీ పారిపోయేదెలా? తప్పదు బ్రతకాలి నీడలో నిజంవలె, నీళ్ళలో నిప్పువలె ఆత్మను వదిలేసి దాని స్థానంలో కూడా డబ్బు నింపేసి........

హు.... అడ్జస్ట్‌మెంట్ బ్లడీ ఇటీజ్ అడ్జస్ట్‌మెంట్.

నా ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి జీవనదిలా. ○

